క్లుప్తంగా

మన ఊరు మన బడి పనులకు భూమిపూజ



గోధూర్‌లో భూమిపూజ చేస్తున్న ఎంపీపీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్‌లో మన ఊరు మన బడి పథకం క్రింద ప్రాథమిక పాఠశాలలో రూ.36 లక్షల నిధులతో చేపట్టిన అదనపు గదుల నిర్మాణానికి బుధవారం ఎంపీపీ జాజాల భీమేశ్వరి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సోమ ప్రభాకర్, ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ కొటగిరి వెంకటస్వామి, వీడీసీ చైర్మన్ బూరం సంజీవ్, కాంట్రాక్టర్ పూదరి నర్సగౌడ్, ప్రధానోపాధ్యాయుడు గొల్కొండ నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు రాగి జావ పంపిణీ



రాగి జావ అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

మెట్‌పల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం ఉచితంగా రాగి జావను పంపిణీ చేశారు. ఆర్టీసీ అధికారులు ప్రమీల, జీబీ సింగ్‌ల చేతుల మీదుగా పలువురు ప్రయాణికులు జావను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి సేవా సమితి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వాసాల శరత్‌చంద్ర, జిందం ఆత్మారాం, చిలుక జ్యోతి, కార్తికేయ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్ సంజయ్

కోరుట్ల: ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మన ఇంటికే మన సంజయన్న కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 3వ వార్డులో డాక్టర్ సంజయ్ పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగతంగా ఏమైనా ఆరోగ్య సమస్యలను కూడా అడిగి తెలుసుకుని, సమస్యలకు వెంటనే పరిష్కారం చూపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పవన్, స్థానిక కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బోరు వేశారు.. మోటారు మరిచారు..



వృథాగా ఉన్న బోరు

రాయికల్: మండలంలోని ధర్మాజీపేట శ్మశాన వాటికలో మిషన్ భగీరథ అధికారులు ఏడాది క్రితం బోరు వేసి, మోటారు బిగించడం మరిచారు. ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ మారంపెల్లి స్నేహ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి మోటారు బిగించాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గొల్లపల్లి: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఈరవేని రాజ్‌కుమార్ తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ నాలుగు కోర్సులు ఉన్నాయని, ఒక్కో గ్రూపులో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పిల్లల ఆరోగ్యానికి రక్షణేది?

- నెల రోజుల పాటు సెలవుల్లో పిడియాట్రీషియన్
- వైద్యసేవలకు జగిత్యాల, కోరుట్లకు
- పట్టించుకోని వైద్య విధాన పరిషత్ అధికారులు
- ఆస్పత్రిలో తగ్గిన ప్రసవాలు



ప్రసవాలు జరగక ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న బెడ్లు



రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి

రాయికల్: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 8 నెలల క్రితం వైద్య విధాన పరిషత్‌లోకి మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య విధాన పరిషత్‌లోకి మారినప్పటికీ రాయికల్ ఆస్పత్రిలో సరిపడా వైద్యులు లేకపోవడంతో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందడం లేదు. వైద్య కోసం ప్రజలు జగిత్యాల, కోరుట్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిడియాట్రీషియన్, వైద్యుల కొరత...

రాయికల్ వైద్య విధాన పరిషత్‌లో చిన్న పిల్లల డాక్టర్‌గా పనిచేస్తున్న హర్షిత నెల రోజులుగా సెలవుపై వెళ్లడంతో ఇక్కడ పిల్లలకు వైద్య సేవలు అందడం లేదు. వైద్యాధికారులు ఎవరినీ నియమించకపోవడంతో రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించిన చిన్నారులను వైద్యం కోసం జగిత్యాల, కోరుట్లకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఆస్పత్రిలో ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా మత్తు డాక్టర్ రవికుమార్, డీజీవోగా ఒడ్నాల రజిత, రేడియాలజిస్ట్‌గా సురేందర్, మెడికల్ ఆఫీసర్‌గా తేజస్విని మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన చాతి వైద్య నిపుణులు వాణి కరీంనగర్‌కు బదిలీ కాగా, చిన్నపిల్లల వైద్యురాలిగా పనిచేస్తున్న హర్షిత నెల రోజుల నుంచి సెలవుల్లో ఉన్నారు. ఇటు ఆస్పత్రిలో వైద్యులు కొరతగా ఉన్నప్పటికీ, ఉన్న వైద్యులతోనే వైద్యసేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొందని సూపరింటెండెంట్ ఆవేదన వ్యక్తం చేశారు.

తగ్గుతున్న ప్రసవాలు..

రాయికల్ ఆస్పత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉండటంతో ఇటు వైద్య విధాన పరిషత్ అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో ప్రసవాల సంఖ్య తగ్గుతూనే ఉంది. ఫిబ్రవరిలో 15, మార్చి 14, ఏప్రిల్ 14, మేలో నేటి వరకు 9 మాత్రమే ప్రసవాలు జరిగాయి. దీంతో ఆస్పత్రిలో ముఖ్యంగా చిన్న పిల్లల వైద్యులు లేకపోవడంతో బెడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, వైద్య విధాన పరిషత్ అధికారులు స్పందించి చిన్నపిల్లల వైద్యులను నియమించాలని బాలింతలు, గర్భిణులు కోరుతున్నారు.

చిన్నపిల్లల వైద్యులు లేక ఇబ్బందులు



మాది రాయికల్ మండలం శ్రీరాంనగర్. నా భర్త రాజమౌళి సర్పంచ్‌గా పనిచేస్తున్నాడు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులందరూ ఉంటారని రాయికల్ సర్కారు దవాఖానాకు తీసుకువచ్చాను. నా కోడలుకు బాబు పుట్టాడు. బాబుకు వైద్య సేవల కోసం జగిత్యాల, కోరుట్లకు తీసుకెళ్లాల్సి వస్తోంది. వెంటనే ఆస్పత్రిలో చిన్న పిల్లల వైద్యుడిని నియమించాలి.

– లక్ష్మి, శ్రీరాంనగర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రాయికల్ ఆస్పత్రిలో ముఖ్యంగా చిన్నపిల్లల వైద్యున్ని వెంటనే నియమించాలని కోరుతూ వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆస్పత్రిలో వైద్యులు కొరతగా ఉండటంతో ప్రసవాల సంఖ్య తగ్గుతోంది. వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– రవి, ఆస్పత్రి సూపరింటెండెంట్

ముగిసిన సీఎం కప్ మండల స్థాయి పోటీలు



సీఎం కప్ క్రీడా పోటీల విజేతలతో రాయికల్ ఎంపీపీ సంధ్యారాణి, అధికారులు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో మూడు రోజుల పాటు జరుగుతున్న సీఎం క్రీడలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా రెండు మండలాల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమాలల్లో ఎంపీపీలు, మసర్తి రమేశ్, కోల జమున, ఎంపీడీవోలు మల్లారెడ్డి, రాజేందర్, ఎస్సైలు అజయ్, మనోహర్‌రావు,ఎంఈవో వాసం భీమయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, విద్యార్థులు, యువతి, యువకులు పాల్గొన్నారు.

కథలాపూర్: కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లో మూడు రోజులుగా జరుగుతున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడలు బుధవారం ముగిశాయి. విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించి అభినందించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమాదేవి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీడీవోలు జనార్దన్, వెంకటేశ్‌జాదవ్, సర్పంచ్ బాలరాజు, పీడీ లక్ష్మీరాంనాయక్, పీఈటీలు పాల్గొన్నారు.

గ్రామీణ యువకులు క్రీడాల్లో రాణించాలి

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో మండలస్థాయి సీఎం కప్ క్రీడల ముగింపు కార్యక్రమంలో భాగంగా విజేత జట్లకు ఎంపీపీ జాజాల భీమేశ్వరి కప్‌లను, ప్రశంసా పత్రాలను అందజేశారు.కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, ఏఎస్సై రాములు, ఎంపీటీసీ తిమ్మణి రాములు, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అన్నారు. మండలంలోని భూపతిపూర్‌లో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్, తహసీల్దార్ ఖయ్యూం, సర్పంచ్ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, ఎంఈవో గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ రమాదేవి పాల్గొన్నారు.

మెట్‌పల్లి: క్రీడాకారులను ప్రోత్సహించాలనే ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించిందని ఎంపీపీ మారు సాయిరెడ్డి అన్నారు. మండలంలోని వెల్లుల్లలో బుధవారం సీఎం కప్‌లో గెలుపొందిన క్రీడాకారులకు ఎంపీపీ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి, సర్పంచ్ రజిని న్నారు.

ధర్మపురి: పట్టణంలో మూడు రోజులపాటు నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన వారికి ఎంపీపీ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్, ఎంఈవో భూమయ్య, ఎంపీవో నరేశ్ కుమార్, పీఈటీలు తదితరులున్నారు.



బహుమతులు అందిస్తున్న ఇబ్రహీంపట్నం ఎంపీపీ

కోరుట్ల రూరల్: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన సీఎం 23 కప్ పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలకు ఎంపీపీ తోట నారాయణ, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ఎంపీడీవో నీరజ, ఎంఈవో గంగుల నరేశం, సూపరింటెండెంట్ శ్రీనివాస్,పీఈటీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి




ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కోరుట్ల రూరల్: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిలాపూర్‌లో పారిశుధ్య పనులను జిల్లా అదనపు కలెక్టర్ మంద మకరందు పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 లో భాగంగా బుధవారం నుంచి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గ్రామంలోని కమ్యూనిటీ, వ్యక్తిగత ఇంకుడు గుంతల పనులు, కంపోస్ట్‌షెడ్, కిచెన్ గార్డెన్ పనులను, అవెన్యూ ప్లాంటేషన్, మల్టీ లేయర్ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఆయన వెంట డీఆర్‌డీవో లక్ష్మీనారాయణ, డీపీవో దేవరాజు, ఎంపీడీవో నీరజ, సర్పంచ్ పిడుగు రాధా, తదితరులు ఉన్నారు.

రాయికల్: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ మంద మకరంద్ అన్నారు. రాయికల్ మండలం అల్లీపూర్, భూపతిపూర్ గ్రామాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న ఇంకుడుగుంతలు, కంపోస్ట్ షెడ్లు, కిచెన్‌గార్డెన్, ప్లాంటేషన్ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఆర్డీవో లక్ష్మీనారాయణ, డీపీవో దేవరాజు, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో వేణు, సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, జక్కుల చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

బస్టాండ్‌లో ఖాళీ రంజన్లు



ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. కానీ అందులో నీళ్లు నింపకపోవడంతో బస్టాండ్‌లో ఖాళీ రంజన్లే దర్శనమిస్తున్నాయి. నీళ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు రంజన్లలో నీళ్లు నింపి ప్రయాణికులకు తాగునీటిని అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైకుంఠధామంలో నీటి వసతిలేక ఇక్కట్లు



నీటి వసతి లేని చింతకుంట వైకుంఠధామం

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో వైకుంఠధామం నిర్మించినప్పటికీ నీటి వసతి లేకపోవడంతో అంత్యక్రియలకు హాజరయ్యేవారు ఇక్కట్లపాలవుతున్నారు. వ్యక్తి మృతిచెందితే అంత్యక్రియలు పూర్తయ్యాక స్నానాలు చేయడం సాంప్రదాయం. ఉపాధిహామీ పథకం నిధులు రూ. 10 లక్షలతో నిర్మించిన వైకుంఠధామంలో నీటి వసతిలేనప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామం వద్ద స్నానాలు చేసేందుకు వీలుగా ట్యాంక్ బిగించి పైపులు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

న్యాయవాదులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలి

మెట్‌పల్లి: జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వం హెల్త్ కార్డులు ఇవ్వాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి కోరారు. నాలుగేళ్లుగా కార్డులు ఇవ్వకపోవడంతో చాలా మంది న్యాయవాదులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే రూ.2లక్షల వరకు ఉన్న వైద్య సహాయాన్ని రూ.5లక్షలకు పెంచి, న్యాయవాదుల తల్లిదండ్రులకూ అవకాశమివ్వాలని విజ్ఞప్తి చేశారు.

కంటి వెలుగు ప్రారంభం

కథలాపూర్: మండలంలోని కలిగోటలో కంటివెలుగును బుధవారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షలు చేయించుకున్నవారికి అవసరమైతే ఉచితంగా కళ్లద్దాలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సురేంద్ర, జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచ్ ధరావత్ సరోజ, ఎంపీటీసీ దేవేంద్ర, గంగాధర్, నాగేశ్వర్‌రావు, సీతరామ్‌నాయక్ పాల్గొన్నారు.

అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్యం



అంబులెన్స్ ప్రారంభిస్తున్న వికాశ్‌రావు, దీప

కథలాపూర్: మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్యం కోసం బీమారం మండలకేంద్రానికి అంబులెన్స్‌ను అందించినట్లు కరీంనగర్ ప్రతిమ ఆస్పత్రి రేడియాలజీ విభాగాధిపతి చెన్నమనేని వికాశ్‌రావు అన్నారు. బుధవారం బీమారం మండలకేంద్రంలో ప్రతిమ ఫౌండేషన్ తరుపున ఉచితంగా అందించిన అంబులెన్స్‌ను వైద్యురాలు చెన్నమనేని దీపతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబులెన్స్ అందుబాటులో ఉంటే సకాలంలో మంచి వైద్యం అందుతుందని ప్రజల్లో భరోసా కలుగుతుందన్నారు. ప్రతిమ ఫౌండేషన్ తరుపున పలు గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని, మహిళలకు కుట్టు మిషన్లు అందించామన్నారు. యువకుల్లో నైపుణ్య శిక్షణ అవసరమని తమ సంస్థ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో అసమానతలు, అవినీతి పెరిగిపోయిందని, వీటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందన్నారు. ఎన్నికలప్పుడు మంచివారికి ఓటు వేయాలని, ఓటును కత్తిపోటుగా మార్చి అవినీతిపరులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు చెక్కపెల్లి అరుణ, కరండ్ల మధుకర్, ఎంపీటీసీ పల్లి అర్జున్, బీజేపీ మండలాధ్యక్షుడు ముంజ శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ క్యాతం దశరథంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని చైర్‌పర్సన్ రాణవేని సుజాత కోరారు. స్థానిక 19 వార్డులో బుధవారం తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో చెత్తను తడి, పొడిగా విభజించి మున్సిపల్ వాహనాలకు అందజేయాలన్నారు. అలాగే ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేయొద్దని సూచించారు. ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే దోమల బెడద పెరిగిపోయి వ్యాధుల బారిన పడే అవకాశముంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అంతకు ముందు సిబ్బంది తడి, పొడి చెత్త గురించి వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, సిబ్బంది విష్ణు, ముజీబ్, నిజాం, గంగారాణి, గీత, నజీమా తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే సీజ్ చేస్తాం

- ధర్మపురి సీఐ కోటేశ్వర్
- వాహనాల తనిఖీ



పట్టుకున్న వాహనాలతో సీఐ,సిబ్బంది

ధర్మపురి: మైనర్ పిల్లలకు వాహనాలిస్తే చట్ట ప్రకారం వాహనాలు సీజ్ చేస్తామని ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ అన్నారు. పట్టణంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో వాహనాలు మైనర్లు నడిపే వారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుందని, జనం ఉన్న ప్రదేశాల్లో ఓవర్ స్పీడ్‌తో వెళ్తున్న ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, అంతే కాకుండా వచ్చి రాని డ్రైవింగ్‌తో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఇక నుంచి లైసెన్సులు లేకుండా మైనర్లు వాహనాలు, నెంబర్ ప్లేట్‌లు లేని వాహనాలు నడిపిన సీజ్ చేస్తామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే, వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బంది తదితరులున్నారు.

తరుగు లేకుండా ధాన్యం కొంటామని భరోసా ఇవ్వాలి



కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న నాయకులు

సారంగాపూర్: ధాన్యం విషయంలో జిల్లా మంత్రి ప్రతి గింజ రైతుల నుంచి కొనుగోలు చేస్తామని చెప్పటంతో సరిపోదని, ఎలాంటి తరుగు లేకుండా కొనుగోలు చేస్తామన్న భరోసాను రైతులకు కల్పించాలని జిల్లా రైతు ఐక్యవేదిక మాజీ అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని అర్పపల్లితో పాటు పలు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించి మాట్లాడారు. ధాన్యం తేమ గుర్తించి, తాలు తప్ప లేకుండా పట్టిన దానికి సంచికి 40.600 కిలోలు తూకం వేయాలనే నిబంధన అమలు కావడం లేదన్నారు. మిల్లర్లు పట్టిన ధాన్యం సంచికి 2 నుంచి 3 కిలోల అదనంగా తూకం వేస్తేనే ధాన్యం సంచులను దించుకుంటామని రైతులను మిల్లర్లు ఇబ్బందిపెడుతున్న విషయాన్ని జిల్లా మంత్రికి కనపడడం లేదా అని ప్రశ్నించారు. రైతుల నుంచి ప్రతి గింజా కొంటామని చెప్పడంతో మంత్రి, ఎమ్మెల్యేల భాధ్యత తీరిపోదని, తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇవ్వాలని ఆయన కోరారు. ఆయన వెంట పార్టీ మండల అధక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు దీటి వెంకటేశ్, రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రైతుల ధర్నా



ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా చేస్తున్న రైతులు

కోరుట్ల రూరల్: మార్కెట్ యార్డులో పోసిన ధాన్యాన్ని కొనుగోలు చేయటం లేదని రైతులు బుధవారం పట్టణంలోని జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. నెల రోజుల క్రితం ధాన్యాన్ని మార్కెట్ యార్డులో పోశామని మ్యాచర్ పేరుతో జాప్యం చేస్తున్నారన్నారు. ధర్నా స్థలానికి తహసీల్దార్ నీరటి రాజేశ్, ఎస్సై సతీశ్ కుమార్ చేరుకొని కొనుగోళ్లు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.